క్లుప్తంగా

వెబ్ ఆప్షన్‌ను బహిష్కరించండి



ఏపీటీఎఫ్ అకడమిక్ కన్వీనర్ రాజు

బొబ్బిలి: ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రక్రియలో ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మాన్యువల్ కౌన్సెలింగ్ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు విస్మరించారన్నారు. ఇప్పుడే వేరేగా వెబ్ ఆప్షన్స్ కోసం సైట్ ఓపెన్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇది మోసపూరిత చర్య అని దుయ్యబట్టారు. ఉపాధ్యాయ ఐక్య సంఘాల పిలుపు మేరకు ఎస్జీటీలు వెబ్ ఆప్షన్‌ను బహిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి



అడ్మిషన్ డ్రైవ్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అధ్యాపకుడు ఈశ్వరరావు

వంగర: మండలంలోని నీలయ్యవలస గ్రామం, బలిజిపేట మండలంలోని చినగళావిల్లి, కొండవలస గ్రామాల్లో మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తూలుగు ఈశ్వరరావు శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన, ఒత్తిడి లేని విద్య అందజేయడం జరుగుతుందని, ప్రభుత్వ సదుపాయాలు కూడా ఉంటాయని వివరించారు.

వినతిపత్రం అందజేత



ఎంఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లకు బదిలీలు వెబ్‌ఆప్షన్ ద్వారా కాకుండా మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ ద్వారా చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ పిలుపు మేరకు బదిలీ అవుతున్న ఉపాధ్యాయులమంతా వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నామన్నారు. అనంతరం ఎంఈవో లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, శ్రీనివాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


చెడు అలవాట్లకు దూరంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్


రాజాం సిటీ: మద్యం సేవించడం, పొగ తాగడం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని సారధి గ్రామంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లు బారినపడి జీవితంనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు.

నోటరీ అడ్వకేట్‌గా రామినాయుడు



రాజాం సిటీ: స్థానిక బార్ అసోసియేషన్‌లో మరో నోటరీ అడ్వకేట్‌గా కిమిడి రామినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన శనివారం తెలిపారు. ఆయన నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి వేణునాయుడు, జద్దు అప్పలనాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎట్టకేలకు రోడ్ల మరమ్మతులు



జేసీబీ సాయంతో రోడ్డు చదును పనులు చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: మండల పరిధిలోని గ్రోత్ సెంటర్‌లో రోడ్ల మరమ్మతులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రోడ్డు బాగాలేకపోవడంపై ఇటీవల సాక్షి దినపత్రికలో 'గోతుల రహదారుల గ్రోత్ సెంటర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన సంబంధిత యంత్రాంగం రోడ్లు బాగుచేసేందుకు చొరవ చూపారు. ఈ మేరకు రోడ్డు మరమ్మతులు చేపట్టారు.

చెరువు..కనుమరుగు!

- కబ్జా కోరల్లో సాగునీటి చెరువులు
- అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు, ఆక్రమణలు
- రోజురోజుకూ తగ్గుతున్న కోనేరుల విస్తీర్ణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఆక్రమణలో రాజాం మండలంలోని బొద్దాం దగ్గరి సాగునీటి చెరువు



విస్తీర్ణం తగ్గిన రాజాం మండలంలోని శ్యాంపురం కోనేరు



కబ్జా కోరల్లో చిక్కుకున్న సంతకవిటి మండలంలోని మద్దూరుపేట బప్పన్న సాగునీటి చెరువు

రాజాం: కబ్జా కోరల్లో చిక్కుకుని చెరువులు కనుమరుగవుతున్నాయి. ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు, ఆక్రమణలు ఎక్కువవుతుండడంతో క్రమక్రమంగా కోనేరుల విస్తీర్ణం తగ్గుతోంది. గతంలో వేసవిలో నీటిఎద్దడి తీర్చే చెరువులు..కుళాయిలు వచ్చిన తర్వాత జనానికి వీటి అవసరం తగ్గి మూగజీవాల దాహార్తి, స్నానం, పంటల సాగుకు పరిమితమైంది. ఏటా ఎండాకాలంలో చెరువులు ఎండిపోయి ఖాళీగా కనిపిస్తుండగా కబ్జాదారుల కళ్లు వాటిపై పడుతున్నాయి. ఎవరికి వారు నచ్చినట్లు వాడుకుంటున్నారు. కొంతమంది వాటిలోని మన్ను తరలించుకుపోతుండగా, మరికొంతమంది చెరువు భాగాన్ని దగ్గరలోని తమ భూమిలో కలిపేసుకుంటున్నారు. ఫలితంగా వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే చెరువు నీటితో నిండిపోవడం, వరదనీరు చెరువు గట్టుపై ప్రవహించి గట్టు కొట్టేయడం వంటివి జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా చెరువులను సంరక్షించాలని కోరుతున్నారు. -నియోజకవర్గంలో 283కి పైగా చెరువులు..

రాజాం నియోజకవర్గంలో 283కి పైగా సాగునీటి చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు ఆక్రమణల్లో ఉండడంతో గతంలో ఉన్న వాస్తవ విస్తీర్ణం కన్నా తక్కువగా ఉన్నాయి. చెరువుల పైభాగాన గ్రావెల్ కప్పి చెరువుల్లో పొలాలు తయారు చేస్తున్నారు. ఫలితంగా చెరువులు కనుమరుగవుతున్నాయి. విస్తీర్ణం బాగా కుదించుకుపోతోంది. గ్రావెల్‌కు ధర కూడా బాగా ఉండడంతో ఎర్రమట్టి ఉన్న చెరువుల్లో తవ్వకాలు చేస్తూ మట్టి తరలించేస్తున్నారు. దీంతో సాగునీటికి చెరువులు పనికిరాకుండా పోతున్నాయి. గతంలో మద్దువలస, తోటపల్లి సాగునీటి కాలువలు లేని సమయంలో చెరువులే ప్రధాన ఆధారంగా పంటల సాగు జరిగేది. ఇప్పుడు కాలువలు వచ్చి, వాటికి అనుసంధానంగా చెరువులు ఉన్నా, ఆక్రమణల వల్ల సాగునీటి నిల్వలు ఉండడం లేదు. అప్పట్లో నియోజకవర్గంలో 283 సాగునీటి చెరువుల పరిధిలో 34,800 ఎకరాల ఆయకట్టులో పంటలు పండేవి. ఇప్పుడు ఈ ఆయకట్టు 13,600 ఎకరాలకు పరిమితమైంది. దీనిలో ఎక్కువ ఆయకట్టు ప్రస్తుతం మద్దువలస, తోటపల్లి కాలువల ఆయకట్టులో కొనసాగుతోంది.

వాల్టా.. ఉల్టా..

ప్రకృతి వనరుల పరిరక్షణ నిమిత్తం అమలులోని వాల్టా.. నియోజకవర్గంలో ఎక్కడా కానరావడం లేదు. ప్రధానంగా రాజాం, బొద్దాం, శ్యామ్‌పురం, పొగిరి, కంచరాం, పొనుగుటివలస, గురవాం, ఉంగరాడ, రేగిడి, వంగర, కాగితాపల్లి, సిరిపురం, ముకుందపురం, సంతకవిటి, మద్దూరుపేట, గుళ్ల సీతారాంపురం తదితర ప్రాంతాల్లో సాగునీటి చెరువులు ఎక్కువగా ఆక్రమణల్లో ఉన్నాయి. కొన్నిచోట్ల చెరువులు పూర్తిగా కనిపించని పరిస్థితి. ప్రధాన గ్రామాలకు, పొలాలకు ఆనుకుని ఉన్న చిన్నచిన్న చెరువులు పొలాల్లో, ఇళ్లస్థలాల్లో కలిసిపోయాయి. చెరువుల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో కూడా మాయమవుతుండడం కొసమెరుపు. ప్రభుత్వం మారే సమయంలో రెవెన్యూ రికార్డుల్లో ఈ మార్పులు జరుగుతుండడంతో చెరువుల అసలు విస్తీర్ణం ఎవరూ పట్టుకోలేని పరిస్థితి నెలకొంటోంది. నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం 64 చెరువుల్లో ఆక్రమణలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. వీటిపై ఇంతవరకు అధికారులు చర్యల్లేవు.

ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు..

గతంలో మా గ్రామంలోని సాగునీటి చెరువులో నీరు ఉండేది. ప్రస్తుతం చెరువు ఆక్రమణకు గురవుతోంది. ఈ కారణంగా ఆయకట్టుకు సరిపడ నీరు చెరువులో లేదు. దీంతో చెరువు ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

వి.వెంకటరావు,
రైతు, మద్దూరుపేట, సంతకవిటి మండలం

అధికారుల చర్యలు శూన్యం..

చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా అధికారుల చర్యలు శూన్యం. చెరువుల ఆక్రమణదారులను ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తే లేనిపోని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చెరువులు పరిరక్షించాల్సిన అధికారులే పట్టించుకోకుండా ఉంటే ఎలా? ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి.

ఎం.రామస్వామి,
రైతు, శ్యాంపురం, రాజాం మండలం

చర్యలు తీసుకుంటాం..

ఆక్రమణకు గురవుతున్న సాగునీటి చెరువులను గుర్తించి, చర్యలు తీసుకునేందుకు వీఆర్‌వోలను అప్రమత్తం చేశాం. పలుచోట్ల ఆక్రమణలపై కోర్టుల్లో కేసులు కూడా ఉన్నాయి. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లోని చెరువుల్లోని ఆక్రమణలు తొలగిస్తున్నాం. వాల్టాను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు.

-బి.ప్రకాష్‌రాజ్, డిప్యూటీ తహసీల్దారు, రాజాం

యూటీఎఫ్ నిరసన



రామభద్రపురం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్(ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక) నాయకులు శనివారం నిరసన చేపట్టారు. ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లకు బదిలీలు వెబ్‌ఆప్షన్ ద్వారా కాకుండా మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ ద్వారా చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ పిలుపు మేరకు తప్పనిసరిగా బదిలీ అవుతున్న ఉపాధ్యాయులమంతా వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నామన్నారు. అలాగే ఆదర్శ ప్రాథమిక పాఠశాలల మాదిరి 60 మంది పిల్లలు ఉన్న బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు(తెలుగు, హిందీ) టీచర్లను నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలు రెండూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, మండల ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

-రామభద్రపురం

ఇలా ఉంటే..సాగునీరందేదెలా?



ఈ చిత్రంలో కనిపిస్తోంది..తెర్లాం మండలం, ఆమిటి గ్రామ సాగునీటి కాలువ. ప్రస్తుతం ఇది పూర్తిగా తుప్పలు, డొంకలు, పిచ్చిమొక్కలు, పూడికలతో నిండిపోయింది. దీంతో కాలువ ద్వారా పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, అయినా కాలువ బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. కాలువ అభివృద్ధి పనుల కోసం పలుమార్లు అధికారులను కలిసినా స్పందన లేదని, ఇప్పటికైనా చర్యలకు ఉపక్రమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

-తెర్లాం

కార్మిక చట్టాల మార్పు నిర్ణయం దుర్మార్గం



కార్మిక చట్టాలు మార్చేందుకు ఏపీ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలు దుర్మార్గమని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు ఖండించారు. రాష్ట్రంలో కార్మిక చట్టాలు మారుస్తూ ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో శనివారం సమావేశమైన ఆయన కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను వ్యతిరేకిస్తూ జూలై 9వ తేదీన సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, అందరూ ఆ రోజు సమ్మెలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 13 ఏళ్లుగా కనీస వేతన సవరణ జరగలేదని, కనీస వేతనాల బోర్డు కూడా నియమించలేదని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించలేదని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

-రాజాం సిటీ

ప్రజల ప్రాణాలతో కూటమి చెలగాటం

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. ఈ నెల 3వ తేదీన రేషన్ కోసం మల్లయ్యపేట డిపోకు వెళ్తూ రాజాం ఎస్సీ కాలనీకి చెందిన విశ్వనాథం రోడ్డు ప్రమాదానికి గురై చనిపోగా బాధిత కుటుంబాన్ని డాక్టర్ రాజేష్ శనివారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వనాథం మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, గతంలోని ప్రభుత్వం మాదిరి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తే ఈ విషాదం జరిగి ఉండేది కాదన్నారు. మృతుడి కుటుంబం నిరుపేదదని, ఆయనే కుటుంబాన్ని పోషించేవాడని ఇప్పుడు ఆయన లేకపోవడంతో కుటుంబం మొత్తం రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పుడు ఆ కుటుంబానికి దిక్కు ఎవరని ప్రశ్నించారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి దగ్గరకు రేషన్ ఇస్తే అది బాగోలేదని, ఇప్పుడు రేషన్ డిపో దగ్గరకు వెళ్లి గంటల కొద్దీ నిల్చొని రేషన్ తీసుకోవడం, దానిని తిరిగి ఇంటికి మోసుకునిరావడాన్ని బాగుందనడం సిగ్గుచేటన్నారు. పరిపాలన సులభతరం నుంచి కష్టతరం చేసుకోవడమంటే ఇది కాదా అని నిలదీశారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఆసపు సూర్యం, సుదర్శనరావు, సలాది సతీష్, నరేంద్ర, అప్పన్న, మనోహర్, జగదీష్, రంజిత్, సింహాచలం, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న ముస్లిం సోదరులు

బొబ్బిలి/బాడంగి/రేగిడి: మండలాల్లోని మసీదుల్లో బక్రీద్ పండగ శనివారం ఘనంగా జరిగింది. ముస్లిం సోదరులంతా ఉదయాన్నే మసీదులకు చేరుకుని, ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం ధానధర్మాలు చేశారు. అల్లాహ్ భక్తుడు, దైవప్రవక్త మహ్మద్ ప్రవక్త త్యాగానికి గుర్తుగా చేసుకునే ఈ పండగ అందరిలో భక్తిభావం, సేవాభావం పెంపొందించిందని మతపెద్దలు తెలిపారు.

వసతిగృహాలు తెరవాలి

బొబ్బిలి: వసతిగృహాలు తెరవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ కోరారు. ఇదే విషయమై ఆయన శనివారం మాట్లాడుతూ ప్రస్తుతం కొన్నిచోట్ల కళాశాలలు, పాఠశాలలు తెరుచుకుంటున్నందున హాస్టళ్లు పునఃప్రారంభించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

బొబ్బిలి: కోటలో సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బేబీనాయన చేతుల మీదుగా శనివారం అందజేశారు. స్థానిక రావువారి వీధి, బాడంగి మండలంలోని గొల్లాది ప్రాంతానికి చెందిన పలువురు అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా వారికి సాయం మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

రాజాం సిటీ: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఐ కె.అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు స్థానిక పట్టణ పరిధిలోని ప్రధాన కూడళ్లలో 11 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను పట్టుకోవడం సులభతరం కావడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ చేయవచ్చన్నారు.

బాధ్యతల స్వీకరణ

బాడంగి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా అదే పాఠశాలకు చెందిన అధ్యాపకుడు వి.వరప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సొసైటీ కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సీనియర్‌గా ఉన్న ఆయనను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నియమించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయనను పాఠశాల సిబ్బంది అభినందించారు.

రాజాం సిటీ: స్థానిక తహసీల్దారుగా ఎం.రాజశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన ఎస్‌కే రాజు.. జామి మండలానికి బదిలీపై వెళ్లడంతో శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లోని రైతులకు నవధాన్యాల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలు సాగు చేసుకుంటే పంటకు అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. నవధాన్యాలు పండించుకుంటే నేల గుల్లబారి సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని తద్వారా భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ, సింహాచలం, సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్డసంచులనే వాడాలి



గుడ్డసంచులు పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

రాజాం: పర్యావరణ పరిరక్షణకు పాలిథిన్, ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డసంచులనే వాడాలని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు కోరారు. స్థానిక పట్టణంలోని మెంతిపేట, ఆదర్శనగర్, వస్త్రపురి కాలనీ తదితర ప్రాంతాల్లో గుడ్డసంచుల పంపిణీ శనివారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. మనం బతకడమే కాదని, మన భవిష్యత్ తరాలను కూడా బతికించుకోవడం ముఖ్యమన్నారు. అందరూ నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు వాడరాదన్నారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి సభ్యులు ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



అభయాంజనేయస్వామి దర్శనం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని పూడివలస గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీరామ అభయాంజనేయ ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కార్యక్రమానికి హాజరై, స్వామి వారికి విశేష పూజలు చేశారు. అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక

రేగిడి: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇచ్చే షైనింగ్ స్టార్స్(ప్రతిభా పురస్కారాలు) అవార్డులకు మండలం నుంచి పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో ఎంవీ ప్రసాదరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో లోలుగు గౌతమి (జెడ్పీహెచ్ఎస్, ఆర్.ఆమదాలవలస), వంజరాపు కావ్యశ్రీ(జెడ్పీహెచ్ఎస్, కందిశ), పోటు ప్రణతి, నాగరాజు (జెడ్పీహెచ్ఎస్ లక్ష్మీపురం), అలికాన సాయిచరణ్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, ఉంగరాడమెట్ట), కంచర ధనలక్ష్మి(జెడ్పీహెచ్ఎస్, ఏవీపురం ఉన్నారన్నారు.

బొబ్బిలిరూరల్: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇచ్చే షైనింగ్ స్టార్స్(ప్రతిభా పురస్కారాలు) అవార్డుకు మండలం నుంచి కునుకు రేవంత్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.వేణుగోపాల్ తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్ తదితరులు

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శనివారం ముగిశాయి. విశేష పూజలు, హోమాలు అనంతరం ఉదయం 7.46 గంటలకు విగ్రహమూర్తుల ప్రతిష్ఠ, ప్రతిబింబ దర్శనం చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తదితరులు ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని కొత్తపేట సమీపంలో ఈ నెల 2వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదైనట్లు సీఐ కె.అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ ఘటనలో వాహనం ఢీకొని ఏగిరెడ్డిపేటకు చెందిన మూడడ్ల అప్పలనాయుడు గాయాలపాలయ్యాడని, అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ రోజు ఉదయం 4 గంటల సమయంలో అప్పలనాయుడు మామిడిపండ్లను రాజాం మార్కెట్‌లో అమ్మేందుకు సైకిల్‌పై వెళ్తుండగా, కొత్తపేట జంక్షన్ దాటిన తర్వాత వెనక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని, దీంతో అతడి కాలు విరిగిపోవడంతో పాటు పక్కటెముకల వద్ద గాయమైందని బాధితుడు తెలిపారన్నారు. ప్రస్తుతం రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనాథలకు అండగా పేరాడ తిలక్



దుప్పట్లు, బియ్యం అందిస్తున్న పేరాడ తిలక్

రేగిడి: మండల పరిధిలోని వావిలవలస గ్రామంలో రాహుల్ సొబర్ నిత్యాన్నదాన సత్రంలో ఆశ్రయం పొందుతున్న అనాథలు, వృద్ధులకు వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ అండగా నిలిచారు. వారి భోజనాల కోసం 100 కిలోల బియ్యం, చలి నుంచి కాపాడుకునేందుకు దుప్పట్లు శనివారం అందించి తనలోని మానవతను చాటుకున్నారు.